సాక్షి
వైఎస్సార్ జిల్లా
బుధవారం । 14 । జూన్ । 2023



మానవతా బంధం

కీలకమైన స్థితిలో మనిషి ప్రాణాలను కాపాడుతుంది రక్తదానం. అందుకే అన్నిదానాల కంటే రక్తదానం గొప్పదంటారు. - 8లో



లారీలు ఢీకొని ఒకరి మృతి

ఎర్రగుంట్ల మండల పరిధిలోని చిలంకూరు-నిడుజివ్వి గ్రామాల మధ్య రెండు లారీలు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. -8లో



ప్రైవేట్ బస్సులో నుంచి జారిపడి కండక్టర్ మృతి

వేగంగా వెళుతున్న ప్రైవేట్ బస్సులో నుంచి జారిపడి పి.జాఫర్‌ఖాన్(65) అనే కండక్టర్ మృతి చెందాడు. - 8లో

పరనింద.. ఆత్మస్తుతి.!

- అధికారపక్షంపై అక్కసు.. సొంత డబ్బాకే పరిమితమైన నారా లోకేష్
- ఈవెనింగ్ వాక్‌ను తలపించిన యువగళం పాదయాత్ర
- ప్రతి సభలోనూ అబద్ధపు మాటలే
- జిల్లాలో పక్షం రోజులు ఇదే రీతిలో సాగిన వైనం



సాక్షి ప్రతినిధి, కడప: 'ప్రజల కష్టాలు తెలుసుకుందామంటే ప్రజలెవ్వరూ దరిదాపులకు రాలేదు. 14 ఏళ్ల అధికారం వెలగబెట్టినా ఈ జిల్లాకు ఒరగబెట్టింది ఏమీ లేదు. చెప్పుకునేందుకు చేసిన కనీస అభివృద్ధి లేదు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ జిల్లాలో యువగళం పాదయాత్ర విజయవంతం బాధ్యత ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జిలకు అప్పగించారు. అరువు తెచ్చిన జనాలతో రక్తికట్టించే జాగ్రత్తలైతే తీసుకున్నారు. కానీ హాజరైన వారినైనా ఆకట్టుకునే చర్యలకు ఉపక్రమించారా అంటే అదీ లేదు. ఎవరో రాసి ఇచ్చిన స్క్రిప్ట్ కూడా సరిగా చదవడం రాలేదు. వెరసి ఈవెనింగ్ వాక్‌ను మరిపించేలా యువగళం పాదయాత్ర కొనసాగింది. పక్షం రోజుల పాటు ఇక్కడ పర్యటించిన టీడీపీ నేత నారా లోకేష్ ఇక చేసేది.. చెప్పేది ఏమీలేక 'ఆత్మస్తుతి..పరనింద'కు ప్రాధాన్యత ఇస్తూ తన పర్యటన ముగించుకుని వెళ్లారు. అధికారంలో ఉన్నప్పుడు నలుగురికి మంచి చేసినా, ప్రాంతాన్ని అభివృద్ధి చేసినా ప్రజలు గుర్తు పెట్టుకోవడం సహజం. అయితే తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న 14 ఏళ్లు వైఎస్సార్ జిల్లా వివక్షకు గురైంది. ఒక్కమాటలో చెప్పాలంటే చంద్రబాబు హయాం మొత్తం జిల్లాకు చంద్రగ్రహణం పట్టిందనే చెప్పాలి. నిర్దిష్టమైన అభివృద్ధి చేపట్టకపోగా, పైగా జిల్లాపై, ఇక్కడి ప్రజానీకంపై విషం గక్కారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ ఎలాంటి ఘటన చోటుచేసుకున్నా 'కడప గూండాలు, పులివెందుల రౌడీలంటూ' అభాండాలు వేస్తూ, ఆత్మాభిమానంపై దెబ్బకొట్టారు. అధికారంలో లేనప్పుడు మాత్రం ఈ జిల్లాపై 'మొసలి కన్నీరు' కార్చడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. ఈ విషయంలో' పెదబాబు–చినబాబు ఇద్దరూ ఇద్దరే' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు సైతం వెల్లడిస్తున్నారు.

పాదయాత్రకు కొత్త భాష్యం...

ప్రజలు ప్రభుత్వం వద్దకు వెళ్లి వారి సమస్యలు చెప్పుకోలేని స్థితి, చెప్పుకున్నా పరిష్కారం లభించని పరిస్థితుల్లో నాయకులే ప్రజల దగ్గరికి వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని వాటికి పరిష్కార మార్గం చూపించడం పాదయాత్ర ముఖ్య ఉద్దేశం. అయితే నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు కొత్త భాష్యం చెప్పారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభించి, 10.30 గంటలలోపు ముగింపు పలికారు. 'నాడు పెదబాబు రాత్రిళ్లు లాంతరు లైటింగ్‌లో పాదయాత్ర చేపట్టగా, నేడు చినబాబు ఈవెనింగ్ వాక్‌ను తలపించేలా జిల్లాలో పక్షం రోజులు తిరిగారు. ఇక ఏ నియోజకవర్గానికి వెళితే అక్కడ ప్రజాప్రతినిధులను టార్గెట్ చేయడమే అసలు పనిగా పెట్టుకున్నారు. ఆరోపణలకు తగిన ఆధారాలు చూపకపోగా బురద జల్లి పోవడమే లక్ష్యంగా ప్రసంగం కొనసాగింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ అభివృద్ధి సాధించామని చెప్పుకునేందుకు అవకాశం లేకపోవడంతో పదేపదే అనంతపురం జిల్లాలోని 'కియా' కార్ల పరిశ్రమ గురించి ఊదరగొట్టారు.

పక్కా ప్రణాళిక ప్రకారమే..

యువగళం విజయవంతం చేసేందుకు పక్కా ప్రణాళికాబద్ధంగా టీడీపీ పావులు కదిపింది. ఓవైపు జనాలను తరలించే భారాన్ని భరిస్తూనే, మరోవైపు నారా లోకేష్ అండ్ టీమ్‌కు ఖర్చులకు రోజుకు రూ.7లక్షల చొప్పున నియోజకవర్గ ఇన్‌చార్జిలు చెల్లించాల్సి వచ్చిందని వినికిడి. నారా లోకేష్ 'జాలీ'గా యాత్ర చేస్తుంటే వ్యయ ప్రయాసలకు లోనైన ఇన్‌చార్జిల వైపు 'జాలి'గా చూడటం పార్టీ శ్రేణుల వంతైంది. జమ్మలమడుగు మొదలుకొని ప్రొద్దుటూరు, మైదుకూరు, చెన్నూరు, సిద్దవటం, బద్వేల్ ప్రాంతాల్లో బహిరంగ సభల నిర్వహణకు కూడా పథకం ప్రకారం ఇరుకు సందులనే ఎంచుకోవడం విశేషం.

తండ్రికి తగ్గ తనయుడుగా..

అబద్ధాలు వల్లించడంలో తండ్రికి తగ్గ తనయుడుగా నారా లోకేష్ జిల్లాలో పేరు పొందారు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణగా కడప స్టీల్ ప్లాంట్‌ను చెప్పుకోవచ్చు. రాష్ట్ర విభజన చట్టంలో కడపలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పాలని పొందుపర్చినా ఐదేళ్ల కాలంలో టీడీపీ సర్కార్ ఉక్కు పరిశ్రమ ఊసే ఎత్తలేదు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంతో తెగదెంపులు చేసుకున్న తర్వాత 2018 డిసెంబర్ 27న కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం మైలవరం మండలం కంబాలదిన్నె గ్రామం వద్ద సీఎం హోదాలో చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. సరిగ్గా ఎన్నికలకు 3 నెలల ముందు శంకుస్థాపనతో సరిపెట్టారు. టీడీపీ సర్కార్ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం కృషి చేస్తే, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ పట్టించుకోలేదనే విమర్శలు నారా లోకేష్ చేయడం విడ్డూరంగా ఉందని పరిశీలకులు పేర్కొంటున్నారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లు తీవ్రమైన కరోనా వైరస్‌ను ఎదుర్కొని ప్రజలను రక్షించుకునే పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉండిపోయింది. తర్వాత ప్రఖ్యాత స్టీల్ ప్లాంట్ జేఎస్‌డబ్ల్యు సంస్థ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. పరిశ్రమ నెలకొల్పేందుకు అనువైన మౌలిక వసతుల కోసం రూ.725 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించి వసతులు సమకూర్చింది. రూ.3300 కోట్ల పెట్టుబడితో తొలివిడత నిర్మాణానికి జేఎస్‌డబ్ల్యు అధినేత సజ్జన్ జిందాల్ శ్రీకారం చుట్టారు. అలాగే జిల్లాలోని గండికోట, రాజోలి రిజర్వాయర్, నెల్లూరు జిల్లాలోని సోమశిల ప్రాజెక్టు పట్ల కూడా నారా లోకేష్ అవగాహన లేమి స్పష్టంగా తేటతెల్లమైందని పలువురు వివరిస్తున్నారు.

బలోపేతం కాకపోగా.. వర్గాలకు ఆజ్యం...

నారా లోకేష్ యువగళం కార్యక్రమం వల్ల తెలుగుదేశం పార్టీకి బలం చేకూరకపోగా, వర్గ విభేదాలకు ఆజ్యం పోశారని ఆ పార్టీ నేతలే విమర్శిస్తున్నారు. ప్రొద్దుటూరులో ఇన్‌చార్జి గండ్లూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని ఆకాశానికెత్తి, మాజీ ఎమ్మెల్యేలు మల్లెల లింగారెడ్డి, నంద్యాల వరదరాజుల రెడ్డిలను నియంత్రించడంపై ఆయా నేతల అనుచరులు ఆగ్రహోదగ్రులవుతున్నారు. కమలాపురంలో మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డితో ఏకాంతంగా చర్చలు జరపడం, టీడీపీ బహిష్కృత నేతలు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, సాయినాథ్‌శర్మలను లోకేష్ టెంట్‌లోకి అనుమతించడంతో ఇన్‌చార్జిలు అటు పుత్తా నరసింహారెడ్డి, ఇటు పుట్టా సుధాకర్ యాదవ్‌లు రగిలిపోతున్నట్లు తెలుస్తోంది. కడపలో ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి కుటుంబాన్ని నియంత్రించేందుకు కడప నేతలు ఏకమయ్యారని, నేతల మధ్య అనైక్యత స్పష్టంగా కన్పించిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఏదిఏమైనా జిల్లాలో నారా లోకేష్ పాదయాత్ర ఓ ప్రహసనంలా ముగిసిందనడంలో సందేహం లేదు.

ఇంటర్ సప్లిమెంటరీలో మెరుగైన ఫలితం

- ప్రథమ ఇంటర్‌లో 63.32 శాతం, ద్వితీయ ఇంటర్‌లో 75.95 శాతం ఉత్తీర్ణత
- రెగ్యులర్‌కంటే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో మెరుగుపడిన ఫలితాలు
- ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో రాష్ట్రంలో 13వ స్థానం

కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా మే నెల 24వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు మంగళవారం సాయంత్రం ప్రభుత్వం విడుదల చేసింది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 13వ స్థానంలో నిలువగా ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కూడా అదే స్థానంలో నిలిచింది. ప్రథమ సంవత్సరంలో 17,663 మంది పరీక్ష రాయగా 11,185 మంది ఉత్తీర్ణులై 63.32 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో 16,443 మంది పరీక్ష రాయగా 12,488 మంది ఉత్తీర్ణులై 75.95 శాతం ఉత్తీర్ణత పొందారు. కాగా మార్చి నెలలో జరిగిన ఇంటర్ పరీక్షల్లో ప్రథమ సంవత్సరంలో 46 శాతం, ద్వితీయ సంవత్సరంలో 60 శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడంలో భాగంగా పరీక్షలను కట్టుదిట్టంగా జరపడంతో కొంత ఉత్తీర్ణత శాతం తగ్గిందని భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలను సాధించేందుకు కృషి చేస్తామని ఆర్‌ఐఓ రమణరాజు తెలిపారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం బుధవారం ఉదయం 9 గంటలకు జెడ్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు సీఈఓ సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తున్నారని, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీలు, ఇతర గౌరవ సభ్యులు హాజరు కావాలన్నారు. ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ఉన్నందువల్ల సభ్యులంతా 9.00 గంటలకే హాజరు కావాలని ఆయనసూచించారు.

న్యూస్‌రీల్

రేపు వానపాముల ఎరువుల తయారీపై శిక్షణ

కడప అగ్రికల్చర్: కడప నగర శివార్లలోని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 15వ తేదీన వానపాముల ఎరువు తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు 8096888039 నంబర్‌కు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

రైతులు మల్బరీ పంటలను సాగు చేయాలి



మోదీన్‌సాబ్‌పల్లె గ్రామంలో సాగుచేసిన మల్బరీ పంటను పరిశీలిస్తున్న అధికారులు

సిద్దవటం: మండలంలోని రైతులు మల్బరీ పంటలను సాగుచేస్తే రైతులకు సబ్సిడీ మంజూరు చేస్తామని జిల్లా పట్టుపరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలో చెన్నారెడ్డి , మోదీన్‌సాబ్ పల్లె గ్రామంలో హరి అనే రైతులు సాగుచేసిన మల్బరీ పంటను, పట్టు పరిశ్రమ షెడ్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ఎకరాకు దాదాపు 10 టన్నుల ఎరువును మల్బరీ పంటలో వేయాలన్నారు. దానివల్ల పంట దిగుబడి మెండుగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమల శాఖ టెక్నికల్ అధికారి వెంకటరామరాజు, రైతులు పాల్గొన్నారు.

నృత్య, సంగీత కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో కూచిపూడి నృత్యం, కర్నాటక సంగీతం, కీబోర్డు సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి తెలిపారు. కోర్సులకు సంబంధించిన వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.యోగివేమనయూనివర్సిటీ.ఏసీ.ఇన్‌లో సంప్రదించాలని కోరారు. 10 సంవత్సరాలు నిండిన ఎవరైనా ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులని తెలిపారు. తరగతులు ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9492345419 నెంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

గండి నిత్యాన్నదానానికి రూ.లక్ష వితరణ



గండి నిత్యాన్నదానానికి విరాళం అందజేస్తున్న దాతలు

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి మంగళవారం రూ.1,01,116లు విరాళంగా వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. పులివెందులకు చెందిన భవానీ శివశంకర్ సప్లయర్స్ అధినేత లక్ష్మీనారాయణరెడ్డి కుమారుడు మణికంఠేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులు ఈ విరాళం అందజేశారన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా కేజీబీవీ ఉద్యోగుల బదిలీలు



కేజీబీవీ బదిలీల కౌన్సెలింగ్‌లో పాల్గొన్న అధికారులు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లావ్యాప్తంగా మంగళవారం సాయంత్రం కడప డీఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కేజీబీవీ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. ఈ బదిలీల కార్యక్రమంలో డీఆర్‌ఓ గంగాధర్‌గౌడ్, డీఈఓ రాఘవరెడ్డి, సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 29 కేజీబీవీల్లో పనిచేస్తున్న ప్రిన్సిపాల్స్, సీఆర్‌టీలు, నాన్ టీచింగ్ సిబ్బంది తమ అర్హతను బట్టి 90 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 85 మంది హాజరుకాగా అందులో వారి అర్హతలను బట్టి 60 మందిని వివిధ కేజీబీవీలకు బదిలీ చేశారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓ విజయ, ఎస్‌ఎస్‌ఏ సిబ్బంది పాల్గొన్నారు.

చుక్కల భూముల చిక్కులకు పరిష్కారం

హక్కు పత్రాలు పంపిణీ చేసిన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



హక్కు పత్రాన్ని అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప సెవెన్‌రోడ్స్ : దశాబ్దాల నాటి చుక్కల భూముల సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారాన్ని చూపిందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. మంగళవారం కడప ఆర్డీఓ కార్యాలయంలో చిన్నచౌకు, పాలెంపల్లె, గూడూరు, చెమ్ముమియాపేట ప్రాంతాలకు చెందిన 45 మంది రైతులకు 28.12 ఎకరాలపై సర్వహక్కులు కల్పిస్తూ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ జిల్లాలో 17,553 సర్వే నంబర్లలో 31,399 ఎకరాలు చుక్కల భూములు ఉన్నాయని పేర్కొన్నారు. వీటిలో 15,355 మంది రైతులకు 926.43 ఎకరాలపై సర్వహక్కులు ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో చుక్కల భూములు ఉన్న రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి రైతులకు మేలు చేయాలన్న ఉద్దేశంతో జీఓ 152 జారీ చేయడం ద్వారా చుక్కల భూములపై హక్కులు కల్పించారని తెలిపారు. కడప రెవెన్యూ డివిజన్ పరిధిలో మొత్తం 2283 సర్వే నంబర్లలో 5489 ఎకరాల చుక్కల భూములు గుర్తించామని ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి తెలిపారు. ఇందులో 2878 మంది రైతులకు 166.20 ఎకరాలపై హక్కులు కల్పించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యాన సలహాదారు శివప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలువల నిర్మాణానికి రూ.70కోట్ల అనుమతులు

- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి
- కడపలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం



మరియాపురంలోని హిందూ శ్మశాన వాటికలోని పరమేశ్వరుని విగ్రహం వద్ద ఎంపీ, డిప్యూటీ సీఎం, మేయర్, ఎమ్మెల్యేలు

కడప కార్పొరేషన్: కడప కార్పొరేషన్: కడప నగరంలోని లోతట్టు ప్రాంతాలు చిన్నపాటి వర్షానికే మునిగిపోతున్నాయని, ఆయా కాలనీల్లో కాలువల నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.70కోట్లు మంజూరు చేశారని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. రెండు, మూడు రోజుల్లోనే అందుకు సంబంధించిన అనుమతులు వస్తాయన్నారు. మంగళవారం కడప నగరంలోని 40, 47 డివిజన్ల పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ ఎంపీ రామచంద్రారెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అంబేడ్కర్ సర్కిల్ నుంచి వై జంక్షన్ వరకూ రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించామని, మూడు మాసాల్లో ఈ పనులన్నీ పూర్తవుతాయన్నారు. విస్తరణ వల్ల నష్టపోయేవారికి ఇప్పటికే రూ.35కోట్లు చెల్లించామని, మరో రూ.30కోట్లకు టీడీఆర్ బాండ్లు ఇచ్చామని వివరించారు. కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు కాగానే ఆ పనులు కూడా వెంటనే మొదలు పెడతామన్నారు.

- 40, 47 డివిజన్ల పరిధిలో కార్పొరేటర్లు పాకా సురేష్ కుమార్, బాలస్వామిరెడ్డిల ఆధ్వర్యంలో మరియాపురంలో రూ.50లక్షలతో నిర్మించిన హిందూ శ్మశాన వాటికను, అక్కాయపల్లెలో కోటి రూపాయలతో నిర్మించబోతున్న పార్కును, రూ.5లక్షలతో నిర్మించిన పబ్లిక్ టాయ్‌లెట్లను, రూ.2.34కోట్లతో నిర్మించిన ఉపరితల జలాశయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కె. రాజశేఖర్‌రెడ్డి, షఫీ, జహీర్, బండి మరియలు, చల్లా రాజశేఖర్, సీఎంఎం హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా పనులన్నీ పూర్తి కావాలి

రాష్ట్ర ప్లానింగ్ సెక్రటరీ విజయకుమార్, కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న రాష్ట్ర ప్లానింగ్ సెక్రటరీ విజయకుమార్, జిల్లా కలెక్టర్ విజయరామరాజు

పులివెందుల రూరల్: పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్లానింగ్ సెక్రటరీ విజయకుమార్, జిల్లా కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడల్ టౌన్ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారని అందువల్ల ఈ పనులలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలన్నారు. అలాగే జులై 8వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటనలో భాగంగా ఆయన ప్రారంభించే పనులన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్ రెడ్డి, ఆర్డీఓ వెంకటేశులు, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సొసైటీలను బలోపేతం చేయండి

జిల్లాలో పాడి రైతుల సొసైటీలను బలోపేతం చేసేలా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల ధరలు పెరిగిన నేపథ్యంలో వాటిపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్లకు కొరత లేకుండా చూడాలి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : జగనన్న విద్యా కానుక కిట్లను పెండింగ్ లేకుండా అన్ని పాఠశాలల్లో పంపిణీ చేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో విద్యాకానుక కిట్లు, నాడు–నేడు ఫేస్–2పై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో కిట్లను అన్ని పాఠశాలల్లో పంపిణీ చేయాలన్నారు. మండల స్టాక్ పాయింట్లలో డెలివరీ స్టాక్ రిపోర్టును ఎంఈఓలు వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. నాడు–నేడు పనుల్లో ఇంకా ఏవైనా టాయిలెట్స్, టైల్స్ కొరత ఉంటే పూర్తి చేయాలన్నారు. పనుల నిర్వహణలో నాణ్యతా లోపాలు ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి ఈనెల 15న నియోజకవర్గ స్థాయిలో, 17న జిల్లా, 20న రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేసిన విద్యార్థులకు అవార్డులు అందించే కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఈఓ రాఘవరెడ్డి, ఎస్‌ఎస్‌ఏ పీఓ ప్రభాకర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు

జిల్లాలోని 65 గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభమయ్యాయని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. మంగళవారం తన చాంబర్‌లో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు రూపొందించిన 'ప్రజల ముంగిటకు రిజిస్ట్రేషన్ సేవలు' పోస్టర్లు, బ్రోచర్లు, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై గ్రామ స్థాయిలోనే సచివాలయాల ద్వారా ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూములు, వీలునామాలు, దత్తత తదితర దస్తావేజుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలు చేయించుకునే అవకాశం ఏర్పడిందన్నారు. అలాగే ప్రత్యేక వివాహాల రిజిస్ట్రేషన్ సేవలు కూడా లభిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ శివరాం, జిల్లా రిజిస్ట్రార్ పీవీఎస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం

- బద్వేలు ఆర్డీఓ ఆకుల వెంకటరమణ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ ఆకుల వెంకటరమణ

మైదుకూరు : బెంగళూరు – కడప – విజయవాడ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తామని బద్వేలు ఆర్డీఓ ఆకుల వెంకటరమణ తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. బెంగళూరు – విజయవాడ హైవే నిర్మాణంలో మైదుకూరు మండలంలోని వనిపెంట గంజికుంట ముదిరెడ్డిపల్లె గ్రామాలకు చెందిన రైతులు 14.18 ఎకరాల భూమిని కోల్పోనున్నట్టు ఈ సందర్భంగా ఆర్డీఓ పేర్కొన్నారు. ఆ విషయంపై ప్రభుత్వం నోటిఫికేషన్ కూడా జారీ చేసిందన్నారు. భూములు కోల్పోయిన తమకు నష్టపరిహారం చెల్లించే విషయంలో న్యాయం చేయాలని రైతులు మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆర్డీఓను కోరారు. ఆయన దానిపై స్పందిస్తూ పరిహారం చెల్లింపులో రైతులకు తప్పకుండా న్యాయం చేస్తామని అన్నారు. సమావేశంలో తహసీల్దార్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

పాతసామాన్ల గోడౌన్‌లో అగ్నిప్రమాదం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కడప అర్బన్ : కడప నగర శివారులోని చిన్నచౌక్ ప్రాంతంలో మారుతీకార్ల షోరూం ఎదురుగా పాత సామాన్ల (గుజరీ షాపు)లో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. సమాచారం అందిన వెంటనే కడప అగ్నిమాపక కేంద్రం అధికారి, జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి బసివిరెడ్డి ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. మంటలు గుజరీ సామాను మొత్తానికి వ్యాప్తి చెందకుండా పూర్తిగా ఆర్పివేశారు. ఎవరో కాల్చి పడేసిన బీడీ లేదా సిగరెట్టు అంటుకుని ఈ ప్రమాదం జరిగివుండవచ్చని భావిస్తున్నారు. గుజరీ సామాను దుకాణం యజమాని బి.జవ్లా నాయక్ తెలిపిన వివరాల మేరకు దాదాపు రూ.3 లక్షల అస్తి నష్టం జరిగి వుండవచ్చని అగ్నిమాపక శాఖ అధికారులు తెలియజేశారు.

మానవతా 'బంధం'

నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

కడప కల్చరల్ : ఒక్క రోజు అన్నం లేకుంటే అల్లాడిపోతాం .. రెండు రోజులు మంచినీరు తాగకుంటే అసలు ఉండలేం .. కానీ అవసరమైన వ్యక్తికి సరైన సమయంలో రక్తం ఎక్కించకపోతే ఆ జీవితం అక్కడితో అంతమైపోతుంది. అవసరమని అడిగితే అన్నం పెడతారు. దాహమంటే నీళ్లిస్తారు. కానీ అత్యవసరమని ప్రాధేయపడినా రక్తదానం చేసేవారు ఈ సమాజంలో కరువేనని చెప్పక తప్పదు. ఈ అవసరమే నేడు రక్తదాన ఉద్యమంగా మారింది. బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

కీలకమైన స్థితిలో మనిషి ప్రాణాలను కాపాడుతుంది రక్తదానం. అందుకే అన్నిదానాల కంటే రక్తదానం గొప్పదంటారు. రక్తం ఇచ్చిన వారెవరో తెలియకపోయినా ఆ రక్తంతో తమ ప్రాణం నిలబడినందుకు వారి మధ్య రక్త సంబంధం ఏర్పడుతుంది. జిల్లాలో రికార్డు స్థాయిలో రక్తం ఇచ్చిన దాతగా ప్రొద్దుటూరుకు చెందిన గురివిరెడ్డిని పేర్కొంటారు. రక్తదానాన్ని ఉద్యమంగా తీసుకెళ్లి ప్రజల్లో అవగాహన కల్పించిన బోగా పార్వతమ్మ రక్తదాన సేవా సమితి వ్యవస్థాపకులు బోగా చిన్నయ్య, పోరుమామిళ్లకు చెందిన జ్ఞాన సరస్వతి చారిటుబల్ ట్రస్టు వ్యవస్థాపకులు యనమల శ్రీనివాసులు, రక్తదాన ప్రచారమే పెద్ద వ్యాపకంగా పూర్తి స్థాయిలో ప్రచారం, అవగాహన నిర్వహిస్తున్న పట్టుపోగుల పవన్‌కుమార్.. వీరి స్ఫూర్తితో ప్రస్తుతం జిల్లాలో 100కు పైగా స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు కూడా రక్తదాన సేవలు అందిస్తున్నారు. రాజకీయ పార్టీలు కూడా స్పందించి పార్టీలో ఓ విభాగాన్ని రక్తదానం కోసం ఏర్పాటు చేయడం విశేషం.

ఉద్యమం స్థాయిలో..

కడప నగరానికి చెందిన బోగా చిన్నయ్య జిల్లాలో రక్తదాన ఉద్యమకర్తగా పేరుగాంచారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడైన ఆయన భార్యకు సరైన సమయంలో రక్తం అందక కన్ను మూయడం ఆయన జీవితాన్ని ఆలోచనలో పడేసింది. ఉద్యోగానికి రాజీనామా చేసి నాటి నుంచి సొంత ఖర్చుతో సతీమణి పేరిట బోగా పార్వతమ్మ రక్తదాన సేవా సమితి పేరిట రక్తదానం గురించి విస్తృతంగా ప్రచారం ప్రారంభించారు. తన ఆస్తిని పూర్తిగా ఈ ఉద్యమానికే ఖర్చు చేశారు. నేడు జిల్లా వ్యాప్తంగా వందకు మించి రక్తదాన సంస్థలు వెలిసేందుకు స్ఫూర్తినిచ్చారు. అత్యవసరమనిపించినపుడు రక్తదాత వద్దకు సంస్థ వాహనాన్ని పంపుతారు. రక్తదానం చేశాక వారికి ఫలహారం, చల్లని పానీయాలు ఏర్పాటు చేయడమే కాకుండా తిరిగి వారిని సంస్థ వాహనంలోనే ఇంటికి చేరుస్తారు. 20 ఏళ్ల క్రితం ఆయనతో ఒంటిరిగా ప్రారంభమైన రక్తదాన ప్రచారం ఎందరికో స్ఫూర్తినిచ్చి మరెన్నో రక్తదాన సంస్థలు ఏర్పాటయ్యేందుకు దోహదం చేసింది.



రక్తదానం చేస్తున్న యువకులు (ఫైల్)

నిరంతరం అదే ధ్యాస

జిల్లాకు చెందిన యువకుడు పట్టుపోగుల పవన్‌కుమార్ ప్రస్తుతం రక్తదాన ప్రచార కర్తగా విస్తృత స్థాయిలో రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నారు. అవసరమైన ప్రచార సామగ్రిని సమకూర్చుకుంటూ విద్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలలో ప్రచారం చేయడమే కాకుండా ఆ ఉద్యోగులతో ఏటా రక్తదానం చేయిస్తున్నారు. అటు రెడ్ క్రాస్ సంస్థకు సహకరిస్తూ ప్రభుత్వానికి కూడా రక్తదాన విషయంగా తనవంతుగా సేవలు అందిస్తున్నారు. మరో వ్యాపకం అంటూ లేకుండా ఏడాది పొడవునా పవన్‌కుమార్ రక్తదాన ప్రచారం, శిబిరాలు ఏర్పాటుతోనే తలమునకలుగా ఉంటారు.

ఖూన్ కా రిస్తా

2015లో ఖూన్ కా రిస్తా సంస్థ ఏర్పాటైంది. స్థానిక యువకులు ఎం.తారిఖ్ అలీ, ఎస్‌ఎండీ గౌస్‌ఖాన్‌లు స్థాపించారు. రక్తం కొరతతో ఎవరికీ ప్రాణాపాయం కలగకూడదన్న భావనతో ఏర్పాటైన ఈ సంస్థ కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్రలతోపాటు జిల్లాలోని ఇతర పట్టణాల్లో కూడా సేవలందిస్తోంది. రక్తం అవసరమున్న వారు 99481 04130 నంబరులో సంప్రదిస్తే వెంటనే తమ సభ్యులను సంప్రదించి అవసరమైన రక్తదాతను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకు 7000 మందికి పైగా రక్తం అందించారు. పలు రక్తదాన శిబిరాలు, రక్త నిర్ధారణ శిబిరాలు నిర్వహించారు. ప్రతిరోజు ఒకరిద్దరికైనా రక్తం అందిస్తున్నారు. జిల్లాలో మంచి రక్తదాన సంస్థగా అతి తక్కువ సమయంలోనే పేరు గడించింది.

వృద్ధురాలి ఆత్మహత్య



మృతి చెందిన బాల వెంకటమ్మ

చాపాడు : మండలంలోని పల్లవోలు గ్రామానికి దోనాది బాల వెంకటమ్మ(75) అనే వృద్ధురాలు మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ మైనుద్దీన్ తెలిపారు. బాల వెంకటమ్మ కొన్ని రోజులుగా వయసు పైబడిన రీత్యా అనారోగ్యంతో బాధపడుతోంది. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉండగా.. పెద్ద కుమారుడు కొన్నేళ్ల క్రితం చనిపోగా చిన్న కుమారుడైన సాంబశివ వద్ద ఉంటోంది. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాల వెంకటమ్మ నివసించే చిన్న రేకుల షెడ్డులో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై కుమారుడు సాంబశివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

పైపులు తొలగించారని ఫిర్యాదు

చాపాడు : చాపాడులోని సర్వే నంబరు 41-బీ1ఏలో ఉన్న 1.75 సెంట్ల తమ స్థలంలో పాతి ఉన్న పైపులను తొలగించి, పక్కనే ఉన్న కందికట్టెను చెల్లాచెదురు చేశారని గ్రామానికి చెందిన రాజోలి లీలావతమ్మ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 41-బీ1ఏ లోని స్థలంపై ప్రొద్దుటూరు సివిల్ కోర్టులో ఓఎస్ నం.343/2017 ఐ.ఏ నెం.3569/2017 ఇంజెక్షన్ ఆర్డర్ ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ స్థలంపై గత కొన్నేళ్లగా గ్రామానికి చెందిన మోహన్ కుటుంబం, తమ కుటుంబాల మధ్య వివాదం నడుస్తోందన్నారు. స్థల వివాదం కోర్టు పరిధిలో ఉండగా సోమవారం మోహన్ భార్య, గ్రామ వలంటీరు కవిత, కుటుంబ సభ్యులైన లక్షుమ్మ, సరస్వతిలు తమ స్థలంలో పాతి ఉన్న పైపులను తొలగించి, కంది కట్టెను చెల్లాచెదురు చేశారని పేర్కొన్నారు. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

రూ.32 కోట్లతో కేసీ కాలువ పనులు

మైదుకూరు : జిల్లాలో భారీ సాగునీటి ప్రాజెక్టుల్లో ఒకటైన కేసీ కాలువకు రూ.32 కోట్లతో పనులు నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో ఆయకట్టు రోడ్ల పనులకు టెండర్లు కూడా పూర్తయ్యాయి. మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలోని మైదుకూరు, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట మండలాల్లో ఇడమడక, చింతకుంట, కొత్తపల్లె, భాకరాపురం ప్రాంతాల్లో ఆయకట్టు రహదారులు, జీప్ ట్రాక్స్‌లను ఏర్పాటు చేయడం, మరమ్మతులు చేపట్టడం కోసం రూ.23.12 కోట్లతో పనులు చేపట్టనున్నారు. అదే విధంగా మైదుకూరు, చాపాడు, దువ్వూరు ఖాజీపేట మండలాల్లో కేసీ ప్రధాన కాలువకు దెబ్బతిన్న లైనింగ్‌కు మరమ్మతులు, కల్వర్టులు ఏర్పాటు చేయడం, సీసీ వాల్స్, గైడ్ వాల్స్, స్లూయిసుల ఏర్పాటు, మైదుకూరు, ప్రొద్దుటూరు, ఖాజీపేట కేసీ కాలువ కార్యాలయాల్లో రక్షణ గోడలకు మరమ్మతు పనులు నిర్వహించేందుకు రూ.8.87 కోట్లతో అంచనాలు పంపారు. రానున్న సీజన్‌లో ఆయకట్టుకు సాగు నీటిని అందించేందుకు ఎలాంటి అవరోధాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ పనులతో ఆయకట్టు రహదారులు బాగుపడి రైతులకు ఇబ్బందులు తప్పనున్నాయి.

లారీలు ఢీకొని ఒకరి మృతి



వాహనంలో చిక్కుకున్న శివారెడ్డి



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



శివారెడ్డి (ఫైల్)

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు- నిడుజివ్వి గ్రామాల మధ్య సోమవారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో రెండు లారీలు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న వెంటనే సంఘటన స్థలాన్ని ఎర్రగుంట్ల పోలీసులు పరిశీలించి ఏర్పడిన ట్రాఫిక్‌ను తొలగించారు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఖాజీపేట మండలం చెముళ్లపల్లె గ్రామానికి చెందిన మద్దూరు శివారెడ్డి (31) తన మినీ లారీలో ఖాజీపేట మండలం కొత్తపల్లె నుంచి చెరుకు గడ్డల లోడును నార్పలకు తీసుకొని వెళ్తున్నాడు. ముద్దనూరు వైపు నుంచి మరో లారీ వస్తోంది. ఎదురెదురుగా వస్తున్న-వెళ్తున్న ఈ లారీలు ఎర్రగుంట్ల మండలం కడప-తాడిపత్రి జాతీయ రహదారిపై చిలంకూరు- నిడుజివ్వి గ్రామాల మధ్య ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శివారెడ్డి అనే వ్యక్తి మినిలారీలోనే చిక్కుకుని పోయినాడు. లారీడ్రైవర్ వరదజాన్‌కు, మినీ లారీలో ఉండే శరత్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ విషయం తెలిసిన వెంటనే ఎర్రగుంట్ల ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. మినీ లారీలో చిక్కుకున్న శివారెడ్డిని అతికష్టం మీద బయటకు తీసి 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన ఇద్దరిని కూడా అదే వాహనంలో తరలించారు. అయితే చికిత్స పొందుతూ శివారెడ్డి అనే వ్యక్తి మృతి చెందాడు. మృతుడి తండ్రి రమణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాబు, లోకేష్ సీమకు ఏం చేశారు?

- లోకేష్ సీమలోనే జన్మించలేదు
- మేము సిల్లీ ఫెల్లోస్ కాదు.. లోకేష్ గల్లీ ఫెల్లో
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు లోకేష్ బాబు రాయలసీమకు ఏం ఉద్ధరించారో వివరించాలని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రశ్నించారు. ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. రాయలసీమలో పాదయాత్ర పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన సభలో లోకేష్ అవాకులు, చవాకులు పేలాడని ఎమ్మెల్యే తెలిపారు. సీమ రక్తం, సీమ పౌరుషం లోకేష్‌లో లేదని, అసలు ఇక్కడ ఆయన జన్మించలేదని తెలిపారు. లోకేష్ పుట్టింది, పెరిగింది, విద్యాభ్యాసం చేసింది హైదరాబాద్‌లోనేని, ఉన్నత విద్య కోసం లండన్‌కు వెళ్లారే తప్ప రాయలసీమకు ఏనాడు రాలేదన్నారు. తొలిమారు తన తండ్రి కోసం లోకేష్ రాయలసీమకు వచ్చాడని తెలిపారు. మేము పుట్టింది, పెరిగింది, చివరికి మరణించేది కూడా రాయలసీమలోనని తెలిపారు. సీమ సంస్కృతి సంప్రదాయాలు ఏమాత్రం తెలియని లోకేష్‌కు జగన్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. తాను చెప్పే తెలుగు పదాలకు అర్థం చెప్పగలవా లోకేష్ అని ప్రశ్నించారు. దాదాపు 14 ఏళ్లపాటు పరిపాలన చేసిన చంద్రబాబు హయాంలో సీమకు ఒరిగిన ప్రయోజనం ఏమిటో చెప్పాలన్నారు. ఏ ఒక్క నీటి ప్రాజెక్టునైనా పూర్తి చేసి రాయలసీమ వాసుల కన్నీళ్లు తుడిచారా అని ప్రశ్నించారు. గండికోట, బ్రహ్మంసాగర్ ప్రాజెక్టుల నిర్మాణానికి ఎన్టీ రామారావు శిలాఫలకం వేస్తే మళ్లీ అవే శిలాఫలకాలను చంద్రబాబు వేశారని, వైఎస్ రాజశేఖరరెడ్డి మాత్రమే వాటిని పూర్తి చేసి రైతులకు నీళ్లు అందించారన్నారు. రైతులకు వ్యవసాయ రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి మోసం చేసింది నిజం కాదా అని అన్నారు.

జిల్లాలో ఒక విద్యాలయాన్ని అయినా ఏర్పాటు చేశారా?

చంద్రబాబు మొదటి నుంచి రాయలసీమ, కడప జిల్లాలపై వివక్ష చూపారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి విమర్శించారు. ఆయన హయాంలో కడప జిల్లాలో ఒక్క విశ్వవిద్యాలయాన్ని అయినా ప్రారంభించారా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్ కడపలో వైఎస్సార్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి ఇందు కోసం 110 ఎకరాల స్థలాన్ని కేటాయించారన్నారు. పులివెందులలోని ఐజీకార్ల్‌ను అభివృద్ధి చేశారని, మెడికల్ కళాశాలను నిర్మిస్తున్నారన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి యోగివేమన విశ్వవిద్యాలయాన్ని, ట్రిపుల్‌ఐటీని, రిమ్స్ డెంటల్, మెడికల్ కళాశాలలను, కోడూరులో ఉద్యానవన కళాశాలను, ప్రొద్దుటూరులో వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల, పశువైద్య కళాశాలను ఏర్పాటు చేశారని వివరించారు. వైఎస్ కన్నా ముందే ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుకు ఎందుకు ఈ ఆలోచన రాలేదని అడిగారు. ప్రొద్దుటూరుకు కనీసం తాగునీటిని అందించలేని దుస్థితి టీడీపీ ప్రభుత్వానిది అన్నారు. లోకేష్ పాదయాత్ర అత్తారింటికి వచ్చి వెళ్లినట్లే ఉంది తప్ప ఒనగూరిన ప్రయోజనం ఏమీ లేదన్నారు.

ప్రైవేట్ బస్సులో నుంచి జారిపడి కండక్టర్ మృతి

మదనపల్లె : వేగంగా వెళుతున్న ప్రైవేట్ బస్సులో నుంచి జారిపడి కండక్టర్ మృతి చెందిన సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. వాల్మీకిపురం మండలం నాయకవీధికి చెందిన పి.జాఫర్‌ఖాన్(65) ప్రైవేట్ బస్సు కండక్టర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. దాదాపు 30 ఏళ్లకు పైబడి ఈ వృత్తినే నమ్ముకుని జీవనం చేస్తున్నాడు. ప్రస్తుతం చింతామణి-కదిరి మధ్య నడిచే ఎస్.వి.ఎం.ఎస్ ప్రైవేట్ బస్సులో పని చేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు మదనపల్లెలోని బెంగళూరు బస్టాండు నుంచి ఎస్.వి.ఎం.ఎస్. బస్సు ప్రయాణికులతో చింతామణికి బయలుదేరింది. మదనపల్లె-బెంగళూరు రహదారిపై చిప్పిలి సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద బస్సుకు ఎదురుగా ద్విచక్రవాహనం అడ్డురావడంతో డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో బస్సులో డోర్‌కు ఆనుకుని టికెట్లు తీసుకుంటున్న కండక్టర్ జాఫర్‌ఖాన్ ఒక్కసారిగా పట్టుతప్పి ప్రమాదవశాత్తు బస్సులో నుంచి కిందపడ్డాడు. ఘటనలో తల వెనుకవైపున తీవ్ర గాయం కావడంతో అధిక రక్తస్రావం జరిగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. బస్సు క్లీనర్, డ్రైవర్‌లు గాయపడిన కండక్టర్ జాఫర్‌ఖాన్‌ను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే కండక్టర్ మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

అక్రమ గ్యాస్ సిలిండర్ల పట్టివేత



స్వాధీనం చేసుకున్న గ్యాస్ సిలిండర్లు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న ఓ ఎలక్ట్రికల్ షాపులో రమణారెడ్డి అనే వ్యక్తి అక్రమంగా నిల్వ ఉంచిన 19 గ్యాస్ సిలిండర్లను పట్టుకున్నామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గోవిందరావు మోరే తెలిపారు. మంగళవారం రమణారెడ్డి ఇంట్లో తనిఖీలు నిర్వహించగా.. 14 డొమెస్టిక్ సిలిండర్లు, ఐదు కమర్షియల్ సిలిండర్లు లభించాయని.. వాటిని సీజ్ చేసి 6ఏ కింద కేసు నమోదు చేశామని డీటీ పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ ఉంచి అమ్మితే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ప్రయాణికుడికి పర్సు అప్పగింత



ప్రయాణికుడికి పర్సును అందిస్తున్న డిపో అధికారులు

మైదుకూరు : జిల్లాలోని పోరుమామిళ్లకు చెందిన రాజశేఖర్ గుప్త అనే ప్రయాణికుడు బస్సులో ప్రయాణిస్తూ పోగొట్టుకున్న విలువైన వస్తువులను మంగళవారం మైదుకూరు ఆర్టీసీ డిపో అధికారులు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పోరుమామిళ్లకు చెందిన రాజశేఖర్ గుప్త వృత్తి రీత్యా సింగపూర్‌లో ఉంటున్నారు. ఈనెల 7వ తేదీన ఆయన కడప నుంచి మైదుకూరు డిపోకు చెందిన పోరుమామిళ్ల సర్వీస్ బస్సులో స్వగ్రామానికి బయల్దేరారు. మార్గంమధ్యలో తన పర్స్ పోగొట్టుకున్నాడు. ఈ విషయమై మైదుకూరు డిపో అధికారులకు ఫిర్యాదు చేయగా వారు పర్స్‌ను వెతికించి మంగళవారం రాజశేఖర్ గుప్తాకు అప్పగించారు. అందులో సింగపూర్ డాలర్ కరెన్సీ నోట్లు, డెబిట్, క్రెడిట్ కార్డులు, కంపెనీ డిజిటల్ కార్డులు, ఇన్సూరెన్స్ కార్డులు ఉన్నాయని ఈ సందర్భంగా డిపో అధికారులు వివరించారు. సెక్యూరిటీ అధికారి విజయమ్మ సమక్షంలో జనరల్ ఏడీసీ లక్ష్మయ్య ప్రయాణికుడికి పర్స్‌ను అప్పగించారు.

ఘనంగా మేడా రఘు జన్మదిన వేడుకలు



ఎంఆర్‌కేఆర్ సంస్థ ప్రధాన కార్యాలయంలో జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న అధికారులు

రాజంపేట : రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి సోదరుడు ఎంఆర్‌కేఆర్ సంస్థ అధినేత మేడా రఘునాథరెడ్డి జన్మదిన వేడుకలను హైదరాబాదులోని బంజారాహిల్స్‌లో ఎంఆర్‌కేఆర్ సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. చైర్మన్ మేడా రఘునాథ్‌రెడ్డి నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ, శుభాకాంక్షలను తెలుపుతూ బర్త్‌డే కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌కేఆర్ సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కడపలోని ఎంఆర్‌కేఆర్ కార్యాలయంలో నందలూరు సింగల్ విండో అధ్యక్షుడు పాలగిరి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మేడా రఘునాథ్‌రెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేశారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంఆర్‌కేఆర్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

అబ్బాయికి బాబాయ్ శుభాకాంక్షలు : అన్న కుమారుడు మేడా రఘునాథ్‌రెడ్డికి బాబాయి, నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. ఆ దేవదేవుని ఆశీస్సులు రఘుకు నిండుగా ఉండాలని ఆయన కోరారు. సంఘసేవకునిగా తనకుంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న రఘుకు ప్రజలు ఆశ్వీరావాదాలు అందించాలని కోరారు.

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ పురుషోత్తంరాజు

ఒంటిమిట్ట : మండల పరిధిలో ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న బోయపల్లి గ్రామానికి చెందిన మీనిగ సుబ్రమణ్యం(32)ను అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ పురుషోత్తంరాజు మంగళవారం విలేకరుల సమావేశంలో నిందితుడిని హాజరు పరచి, వివరాలు వెల్లడించారు. సర్వకాటిపల్లి అటవీ ప్రాంతంలోని చిలకల బావి ప్రాంతంలో సుబ్రమణ్యం ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతుండగా దాడి చేసి, పట్టుకోవడం జరిగిందని తెలిపారు. అతని వద్ద నుంచి రెండు ఎర్రచందనం దుంగలతోపాటు, ఒక గొడ్డలి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నిందితుడు సుబ్రమణ్యంను రిమాండు తరలించినట్లు వివరించారు. సమావేశంలో ఎస్‌ఐ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.